వైభవంగా విగ్రహ పత్రిష్ఠాపనోత్సవం

చిక్కడపల్లి: గాంధీనగర్‌ని అరుంధతీనగర్ బస్తీలో మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, పుణ్యహవాచనం, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, అన్నప్రదాత శ్రీనివాస్‌గౌడ్, కమిటీ సభ్యులు తీగల శ్రీనివాస్‌గౌడ్, కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర, పి.యాదగిరి ముదిరాజు, నాగుల ప్రకాశ్ గంగపుత్ర, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అదానీ అక్రమ ఆస్తులు జాతీయం చేయాలి

సీపీఐ నేత వీఎస్ బోస్

కాచిగూడ: అదానీ అక్రమ ఆస్తులను జాతీయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. 2014లో నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అదానీ వ్యాపార లావాదేవీలలో అధికశాతం అక్రమ వ్యాపారాలే ఉన్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014 కంటే ముందు పరిశ్రమ రంగంలో అదానీ స్థానం ఎక్కడో చివరి సంఖ్యలో ఉండేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారం, అండదండలతో ఈ రోజు ప్రపంచ కుబేరుల్లో ఒకడిగా స్థానం సంపాదించుకున్నాడని ఆయన అన్నారు. మోదీ సహకారం లేకుండా అదానీ ఈ స్థాయికి ఎగబాకటం అసాధ్యమనేది వ్యాపార రంగంలో అందరికీ తెలిసిన విషయమేనని అన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలి

వడ్లమూరి కృష్ణ స్వరూప్

కాచిగూడ: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను, క్రిమిలేయర్‌ను వెంటనే రద్దు చేయాలని.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ వడ్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. బుధవారం భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా హిమాయత్‌నగర్‌లోని దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ఎస్సీ, ఎస్టీ, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాలలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు నిలుపుదల చేయాలన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్గీకరణ వద్దు, రాజ్యాధికారం ముద్దు అంటూ పాలకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

బీజేవైఎం ఎస్ఈ మెంబర్‌గా మాచర్ల అర్జున్

నల్లకుంట: బీజేవైఎం స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నల్లకుంటకు చెందిన మాచర్ల అర్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. బుధవారం సాయంత్రం బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు ఆయనను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. తనకు పదవి రావడంలో తమ వంతు సహకారం అందించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతం రావులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎర్రోళ్ళ రాఘవేందర్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య బుధవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాఘవేందర్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధి కోసం, బీసీల అభివృద్ధి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జరిగే అన్ని ఉద్యమాల్లో పాల్గొంటూ విజయవంతంగా పూర్తయ్యే విధంగా చూస్తానని పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఆర్.కృష్ణయ్యకు సహకరించిన బీసీ నేతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

బీఆర్ఎస్ నేత హనుమంతుగౌడ్ మృతి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్ సోదరుడు, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ బీసీ సెల్ కార్యదర్శి హనుమంతుగౌడ్(42) బుధవారం మృతి చెందాడు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌బీఐకాలనీలో హనుమంతుగౌడ్ భౌతికకాయానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన కమిటీ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు బింగి నవీన్, మహ్మద్ ఆలీ నివాళి అర్పించారు. బన్సీలాల్‌పేట్‌లోని శ్మశానవాటికలో అంత్యక్రియలను నిర్వహించారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన అబ్దుల్ సయీద్ (76) నగరంలోని కూతుళ్లను చూడాటానికి మంగళవారం రాత్రి అకోలా ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వచ్చాడు. ప్లాట్‌ఫాం 5పై రైలు దిగి పట్టాలను దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. కాచిగూడ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

కాచిగూడ: ఓ వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక న్యూ ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన బాలనర్సమ్మ (76) బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో బాధితురాలి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసును నమోదు చేశారు.

రాఘవేంద్రస్వామి దర్శనం.. మోక్షానికి మార్గం

కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

- వైభవంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- మధ్వారాధన వేడుకలకు తరలివచ్చిన భక్తజనం
- బర్కత్‌పురలోని మఠంలో అన్నదానం



బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి



హారతి ఇస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి



బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో జరిగిన అన్నదానంలో భక్తులు

కాచిగూడ: రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం కాచిగూడ, లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో మధ్వారాధన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నిర్మాల్య విసర్జనం అనంతరం స్వామివారి బృందావనానికి భక్తుల అష్టోత్తర పారాయణం నడుమ పాలు, పంచామృతాలు, ఫలాలతో అభిషేకం చేశారు. ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలకు మఠం అర్చకులు పాద పూజ, కనకాభిషేకం నిర్వహించారు. మధ్వ బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం గోపూజ, ధాన్యలక్ష్మి పూజను నిర్వహించిన అనంతరం స్వామివారికి మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు రాఘవేంద్రస్వామి బృందావనానికి వచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బృందావన సమితి కార్యదర్శి బీపీ రాఘవేందర్‌రావు, మేనేజర్ కె.నర్సింహచార్య ఆయనకు శాలువా జ్ఞాపికలతో సత్కరించారు.హీ కార్యక్రమాల్లో సమితి సభ్యులు ఎం.కృష్ణమూర్తి, బి.హరిరావు, కె.ఆర్.ప్రహల్లాదరావు, ఎస్.రాజారావు, టి.గురురాజ్‌రావు, హెచ్.రాఘవేంద్ర, బి.కె.పవన్, కె.వెంకటేష్ తదితరులతో పాటు మధ్వ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో..

మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల జయజయధ్వానాల మధ్య మధ్వారాధన వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బర్కత్‌పురలోని స్వామివారి బృందావనానికి 500 లీటర్ల పాలు, పెరుగు, పండ్లు, తేనే, నెయ్యితో అభిషేకం చేశారు. మూల రాములు, దిగ్విజయరాములు, జయరాములు, సంతాన గోపాలకృష్ణ, వైకుంఠ వాసుదేవతామూర్తి విగ్రహ ప్రతిమలకు దూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

- ఈ సందర్భంగా స్వామివారికి నిర్మల్య విసర్జనం, అష్టోత్తర పారాయణం, పాదపూజ, విశేష పంచామృతం, తులసి అర్చన, అలంకార, హస్తోదక, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. శ్రీ మఠం పుష్పాలంకరణతో నిండిపోయింది. ప్రాకారం, ముఖద్వారం రంగురంగుల పూలతో అలంకరించిన తీరు భక్తులకు నయనానందకరం చేసింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
- రాఘవేంద్రస్వామి దర్శనం కోసం బారులు తీరారు. ప్రాకారంలో పొర్లు దండాలు, సాష్టాంగ నమస్కారాలు సమర్పించారు. భక్తులకు అన్నప్రసాద వితర జరిగింది. ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బంది, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ కొడూరి సూర్య చంద్రశేఖరశర్మ, వేదపండితులు, అర్చకులు పాల్గొని స్వామివారి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు రథోత్సవం

రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ముఖ్యమైన ఉత్తర ఆరాధన సందర్భంగా బర్కత్‌పురలోని స్వామివారి మఠం వద్ద మహా రథోత్సవం గురువారం ఉదయం 9 గంటలకు జరుగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మఠం మేనేజర్ కొడూరి సూర్య చంద్రశేఖర శర్మ కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోంది

- బీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న అంసోల్ లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మరోసారి మోసం చేస్తుందని బహుజన్ ముక్తి పార్టీ (బీఎంపీ) రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ విమర్శించారు. అధికారంలోకి రాక ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 42శాతం బీసీ రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చి దానికి భిన్నంగా నేడు సుప్రీంకోర్టు నిబంధనలను ముందుకు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. బాగ్‌లింగంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం దాటకూడదని రాష్ట్ర ప్రభుత్వం 23శాతం ఇస్తామని ఆలోచిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వాలు కూడా బీసీలను మోసం చేశాయని అదే బాటలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పయనిస్తుందని విమర్శించారు. ప్రభుత్వాలు మారిన బీసీలకు మాత్రం న్యాయం జరగడం లేదన్నారు. సర్దార్ పటేల్ నుంచి నేటి వరకు బీసీలు మోసపోతూనే ఉన్నారని దీనికి కారణం అగ్రకుల పార్టీలు అధికారంలో ఉండటమే అన్నారు. బీసీలకు జన గణన చేస్తామని చెప్పిన ఆ దిశగా ప్రయత్నాలు జరగడం లేదని ఆరోపించారు. కుంటి సాకులతో బీసీల జనగణనను కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తమిళనాడులో బీసీ జనగణన చేసి అసెంబ్లీలో బిల్లు పాస్ చేశారని గుర్తు చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు మాత్రం రాత్రికి రాత్రే 10శాతం బిల్లులు పాస్ చేసిన ప్రభుత్వం బీసీలకు అమలు చేయడానికి ఎందుకు అడ్డంకులు వస్తున్నాయని విమర్శించారు.

నీటి మీటర్ల ఏర్పాటు ప్రతిపాదన రద్దుపై హర్షం

ముషీరాబాద్: సికింద్రాబాద్, కంటోన్మెంట్ ఏరియాలో నివాస గృహాల బోర్‌వెల్స్‌కు డిజిటల్ నీటి మీటర్లు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను రద్దు చేస్తూ కేంద్ర రక్షణ శాఖ ఆగస్టు 12న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల సీపీఎం హర్షం వ్యక్తం చేసింది. బోర్‌వెల్ నీటికి నీటి మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను పబ్లిక్ నోటీసు ద్వారా గత ఏడాది కంటోన్మెంట్ బోర్డు అధికారులు తెలియజేశారు. కంటోన్మెంట్ ప్రజానికం దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిందని సీపీఎం నగర కమిటీ నీటి మీటర్ల ప్రతిపాదనను వ్యతిరేకిస్తు ప్రజల నుంచి సంతకాలను సేకరించి బోర్డు ముందు పెద్ద ఎత్తున తెలియజేశామని ఈ ఆందోళన ఫలితంగానే ఈ ప్రతిపాదనను రద్దు చేశారని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్‌కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలియజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.ప్రభును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపల్ కె.ప్రభును అధ్యాపక బృందం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కె.ప్రభు మాట్లాడుతూ... ఈ విద్యా సంవత్సరం 2024–25ను అటానమస్ హోదా అమలులోకి వచ్చిందనందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. డిగ్రీ కళాశాలలో విద్యాబోధన, మౌలిక వసతుల కోసం, కళాశాల ఆధీనములోనికి రాని ప్రభుత్వ భూమిని మరోక మారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తామన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో ఉన్నత చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎడవెల్లి వెంకటస్వామి నియమితులయ్యారు. ఈ సందర్భంగా అంబర్‌పేట యూత్ కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్, మనోజ్‌కుమార్ ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యకు చెక్ పెడతాం



గాంధీనగర్‌లో పనులను పర్యేవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: అభ్యుదయ హైస్కూల్ నుంచి కృపారావు లేన్ మీదుగా గౌతమి స్కూల్ వైపు నూతన సీవరేజీ పైప్‌లైన్‌తో పాటు సబ్‌లోక్ ఆస్పత్రి లెన్, వాల్మీకినగర్ బస్తీ, హరిత అపార్ట్‌మెంట్ వద్ద సుమారు రూ.80లక్షల నిధులతో నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నామని గాంధీనగర్ కార్పొరేటర్ పావని తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని నూతన పైప్‌లైన్ వేసే ప్రాంతాలను స్థానికులు, నాయకులతో కలసి ఆమె పర్యటించి పర్యవేక్షించారు. ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి వహించి జలమండలి ఉన్నతాధికారులతో సమీక్షించి నిధులు మంజూరు చేయించామని అన్నారు. ఒక వారం రోజుల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న డ్రైనేజీ ఓవర్ ఫ్లో సమస్యకు చెక్ పెడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, స్థానికులు గౌతమి స్కూల్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, జగదీష్, పెంటయ్య, నరేష్ పాల్గొన్నారు.

అభినందనలు

కాచిగూడ: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉంటుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న కాచిగూడ ప్రాంతానికి చెందిన జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థిని అమృతారెడ్డిని బుధవారం కేంద్ర మంత్రి అభినందించారు. మహిళల ఆత్మరక్షణకు కరాటే విద్య ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మహిళల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో జీవీఆర్ కరాటే అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి, అమృతరెడ్డి, నిధి వర్మ, తదితరులు పాల్గొన్నారు.



అమృతారెడ్డిని అభినందిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని నియమించాలి

సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్‌రావు



మౌన దీక్షలో మున్నూరుకాపు నేతలు వెంకటేశ్వర్‌రావు, ఆర్‌వీ మహేందర్‌కుమార్

కాచిగూడ: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి రూ.2వేల కోట్ల నిధులు కేటాయించాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ ఉపాధ్యక్షుడు జల్లెపల్లి వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం కాచిగూడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో మౌన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్‌కుమార్, పసుపులేటి రామారావులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో మున్నూరుకాపు బాల, బాలికల హాస్టల్స్ నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలం, రూ.2కోట్ల నిధులు కేటాయించాలని అన్నారు.

- కోకాపేటలో నిర్మిస్తున్న మున్నూరుకాపుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.20 కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కులగణన నిర్వహించాలని అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20 వతేదీ నుంచి 25వ తేదీ వరకు అన్ని జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో మౌన దీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మున్నూరుకాపుల డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

చేపపిల్లల సరఫరాలో అవకతవకలు నిర్మూలించాలి



మత్స్యశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్య కార్మిక సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత చేప పిల్లల సరఫరాలో అవకతవకలు నిర్మూలించి మత్స్యకారులకు న్యాయం చేయాలని తెలంగాణ మత్స్య కార్మికులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మత్స్యశాఖ రాష్ట్ర కమిషనర్ ప్రియాంకకు వినతిపత్రం సమర్పించారు. టెండర్ల ప్రక్రియ రద్దు చేసి మత్స్య సొసైటీ అకౌంట్‌లలో నగదు జమ చేయాలని వారు కోరారు. సీడ్ సప్లై టెండర్లలో చేప విత్తనాల కేంద్రాలను చూపించి బోగస్ సర్టిఫికెట్లు సమర్పించి టెండర్లలో పాల్గొంటున్నట్లు తెలుస్తుందని ఈ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోని అవకతవకలు నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొరెంకల నర్సింహ, లెల్లల బాలకృష్ణ, ఉపాధ్యక్షులు ముఠా విజయ్‌కుమార్, శంకర్, దశరథ్, జంగయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మోడల్స్ స్కూల్ టీచర్స్ సామూహిక నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కవాడిగూడ: మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హామీని ఇచ్చారు. మోడల్ స్కూల్స్‌ను విద్యాశాఖలో విలీనం చేసి జీరో1, జీరో పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్స్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, జీరో–1, జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు.

- ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం మోడల్ స్కూల్ ఉపాధ్యాయులను 12ఏళ్లుగా బదిలీలు, ప్రమోషన్లు కల్పించకపోవడంతో స్తబ్దత వాతావరణం ఏర్పడి వారిలో నైరాశ్యం పెరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలోని అన్ని శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పిస్తున్నప్పుడు ఆ నిబంధన మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ఎందుకు వర్తించదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లిస్తున్న తేదీలలోనే మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కూడా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.
- మోడల్ స్కూల్ఉపాధ్యాయులందరికి హెల్త్ కార్డులు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. టీజీటీలను జూనియర్ లెక్చరర్‌లుగా అప్‌గ్రేడ్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సెకండ్ ఫేజ్‌లో నియామకమైన టీచర్లందరికి నోషనల్ సర్వీస్ ఇవ్వాలన్నారు. మోడల్ స్కూల్ టీచర్లకు తెలంగాణ ఇంక్రిమెంట్లను వర్తింప చేసి నాన్‌టీచింగ్ పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.
- ఫెడరేషన్ అధ్యక్షులు బి. కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ మహేష్‌లు మాట్లాడుతూ... 2013వ సంవత్సరంలో మోడల్ స్కూల్ ప్రారంభం నుంచి ఒకే దగ్గర పనిచేయడంతో కుటుంబాలకు దూరం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులందరికి బదిలీలు నిర్వహించింది కానీ మోడల్ స్కూల్ టీచర్స్ బదీలీలను విస్మరించిందని వారు ఆరోపించారు. సర్వీస్‌లో మరణించిన మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకే నియామక పరీక్ష ద్వారా ఎంపికై ఆలస్యంగా నియామకం పొందిన ఉపాధ్యాయులకు వేతన వ్యత్యాసాలు తొలగించేందుకు నోషనల్‌సర్వీస్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సామూహిక నిరాహార దీక్షలో టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. జంగయ్య, చావ రవి, ఫెడరేషన్ ట్రెజరర్ రాధా కృష్ణతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మోడల్స్ స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.

భారత్ బంద్ ప్రశాంతం

మాల మహానాడు నేతల అరెస్టు

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన ప్రత్యేక హక్కులకు విఘాతమని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోకన్వీనర్ జంగా శ్రీనివాస్ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ చేపట్టిన భారత్ బంద్‌లో భాగంగా బుధవారం ముషీరాబాద్ బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళన కారులను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పి.లోకేశ్వర్‌రావు, జంబిక తిరుమల్ రావు, ఎం.భానుప్రసాద్, మద్దెల ప్రభాకర్, కొల్లూరి లక్ష్మణ్, శివకుమార్, స్వామిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు.



ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న జంగా శ్రీనివాస్ తదితరులు